# ఆడవాళ్ళూ, వ్యాపార ప్రకటనలు

ఈ ప్రచార యుగంలో ఒకరిని మించి ఒకరు పొగుడుకోవడం దానికి దృశ్యాంకంగా ఒక ప్రకటనని జోడించి ఫోటోలు తీయించి ప్రకటనలు చెయ్యడం, సినిమాలుగా తీసి, టి.వి. లలోనూ, థియేటర్లలోనూ ప్రదర్శించడం పరిపాటై పోయింది.

ఈ ప్రకటనలకి ప్రతీవాళ్ళూ, ఆడవాళ్ళని వాడుకోవడం కూడా అలవాటైపోయింది! చీరలకి, నగలకీ, ఏదో అలాంటి అలంకరణకి సంబంధమైన వాటికి, ఇంకా పౌడర్లూ, స్నోలూ, షాంపూలూ, సబ్బులూ లాంటి వాటికి సరైన విధంగా ఆడవారినే ఉపయోగించుకుంటే ఫరవాలేదు. కానీ, వాళ్ళ వస్తువులు ప్రచారంలోకి రావాలని, ఆడవాళ్ళని నీచంగా చిత్రించడం జరుగుతోంది. అర్ధనగ్నంగా వున్న స్త్రీని, అరవిరిసిన కన్నులతో ఆల్ మోస్ట్ నగ్నంగా వున్న స్త్రీని బట్టలు లేనట్టుగానే వుంచి, స్నానం చేస్తున్నట్టు అతి నాజూకుగా సబ్బు రుద్దుకుంటూన్నట్టూ చూపించడం జరుగుతోంది! అసలు వాళ్ళ వస్తువులు ఏవో ఎలాంటివో గాని ఈ ప్రకటనలవల్ల ఆ వస్తువును ప్రజలు కొనడం, తయారుచేసిన వారికి లాభాలు రావడం జరుగుతోంది. దాంతో ఒకరితో ఒకరు పోటీపడి, ఆడవాళ్ళని ప్రకటనలకి బుక్ చేసుకోవడమే కాకుండా, ఒకరికంటే ఒకరు, వీలైనన్ని యాంగిల్స్‌లో నగ్నంగా చూపించడానికి ప్రయత్నించడం జరుగుతోంది! అందుకోసం విపరీతంగా డబ్బు కురిపించడం కూడా జరుగుతోంది!

ఆ డబ్బు కోసం ఆశపడి కొందరూ, ఈ ప్రకటనలద్వారా పేరుకోసం ఆశపడి కొందరూ విచ్చలవిడిగా ముందుకొస్తున్నారు. ఈ ప్రకటనలు కుర్రవాళ్ళని ఉద్రేకపరుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

వయస్సులో వున్న కుర్రాళ్ళని ఆకర్షించడానికి, సిగరెట్లూ, డ్రింకూ్స్, డ్రగ్స్ (ఇప్పుడు కొత్తగా) ఎలా ఉపయోగపడుతున్నాయో 'మగువా' అలాగే

ఉపయోగపడుతుందీ, పడుతోందీ అని అందరికీ తెలుసు. మద్యం, మందూ లాంటి మత్తుపదార్థాలకుండే ఆకర్షణశక్తి మగువకీ ఉందంటే కవుల దగ్గరనుంచి కాషాయధారుడు కూడా కాదనగలడా?

అటువంటప్పుడు యవ్వనంలో వున్న యువకులను 'సెక్సీ' సినిమాలనుంచే ఆపలేక, మత్తుపదార్థాల ప్రభావం నుంచి రక్షించుకోలేక, మందు ద్రవ్యాల నుంచి కాపాడుకోలేక సతమతమయిపోతూ వుంటే ఈ ప్రకటనలు రోజురోజుకీ మితిమీరి పోతున్నాయ్!

అసభ్యకరమైన వాల్ పోస్టర్లు, కొన్ని కొన్ని సందర్భాలలో ఆడవాళ్ళే సిగ్గుపడి తలవంచుకునేలా చేస్తున్నాయ్! ఆడదంటే ఆటబొమ్మ కాదనీ, అంగడి బొమ్మ అసలే కాదనీ, కథలు రాసే రచయిత (త్రు)లూ నోరెత్తక ఊరుకుంటున్నారు.

దీన్ని అరికట్టే వారెవరు? సినిమాలవారా? వారికి క్లబ్బు డాన్సూ, పై టుస్ లేకపోతే నష్టం! వ్యాపారస్థులా? వారికి ప్రకటనలు లేకపోతే, వారి వస్తువులు అమ్ముడుపోక నష్టం! సెక్సు రచయిత (త్రు)లా? వారిదీ వ్యాపారమే!

పోనీ ఆడవాళ్ళే ఈ ఉద్యమాన్ని సాగిస్తారా అంటే వాళ్ళలోనూ, మోడల్స్‌గా వున్నవాళ్ళు, డబ్బు రుచి చూసినవాళ్ళు నోరు మెదపరు. బాగా డబ్బున్నవాళ్ళకి వీటివల్ల వాళ్ళో, వాళ్ళవాళ్ళో చెడిపోతారన్న బాధ లేదు. ఇక మామూలువారికి ఈ గొడవ అక్కర్లేదు.

మధ్యతరగతి వారికి? ఏదైనా వాళ్ళకే కదా! సాంఘిక కట్టుబాట్లూ, ఆర్థిక సమస్యలూ, సమాజంపట్ల ఆలోచనా అంతా వీళ్ళకే! వీళ్ళు దేన్నీ ధైర్యం చేసి పరిష్కరించలేరు! బాధపడుతూ, మధనపడుతూ జీవితాన్ని లాగుతారు.

మరేం చెయ్యాలి? ఏమి మార్గం? మగువలే నడుం కట్టాలి! తిరుగుబాటు చెయ్యాలి! వారి హక్కులూ, వారి బాధ్యతలూ వారే గుర్తించి, వారి కర్తవ్యాన్ని వారే గుర్తించి పోరాడాలి! పాలతి తలుచుకున్న పొందునే చేకూర్చు పడతి అలిగినప్పుడు ప్రళయమెపుడు ఇంతిలోని శక్తి ఇంతింతకాదయా వమ్ము కాదు శారదన్నమాట!

ఏమంటారు? ★